# పచ్చని జీవితానికో నచ్చిన రూలు

- ఆంధ్రప్రభ, 26-5-1971

'మన జీవితాల్ని....
నిషిద్ధాలమధ్య నలుపుకుని నష్టపోవడం అజ్ఞానం...
ఎవరికీ ఏ అన్యాయం జరగనంతవరకు
వాళ్ళకు ఇష్టమైన రీతిలో ఎవరి జీవితాల్ని వాళ్ళు మలచుకోవడం... వివేకం.'

"అక్కా, నన్ను ఆశీర్వదిస్తావా?"

చేతిలో గరిట పక్కనపెట్టి పకపక నవ్వింది పద్మావతి.

"ఏ డ్రామాలో డైలాగ్‌రా కృష్ణా! ఇది" ఆమె తన నవ్వు తెరల మధ్యగా అతని కళ్ళలోకి చూచి ఉలిక్కిపడింది. అతని కళ్ళు ఆర్ద్రంగా ఉన్నాయి.

"నవ్వకు పద్మక్కా!"

"ఏమైందిరా తమ్ముడూ?" అతని పక్కగా వచ్చి కూర్చుంటూ అంది.

అతను ధైర్యంగా, సూటిగా అక్క కళ్ళలోకి చూసాడు ఒక్క క్షణం. వెంటనే రెప్పవాలుస్తూ అన్నాడు.

"నేను నీకంటే చిన్నవాణ్ణి పద్మక్కా! నేను తప్పుచేస్తే నువ్వుకాక, నన్నెవరు మన్నిస్తారు? నాకు చెప్పడానికి ఎందరు వున్నా, నేను చెప్పుకోవడానికి నువ్వు కాక నాకు ఇంకెవరున్నారు?"

ఎప్పుడూ గలగల నవ్వుతూ, అందరినీ నవ్విస్తూ విచారమంటే ఎరగనట్లే ఉండే యీ పసివాడికేమయింది.....?

"నేను మంజులను పెళ్ళి చేసుకోబోతున్నాను!"

ఉలిక్కిపడింది పద్మ.

"ఎవరు? బాబూరావు మాష్టారు కోడలు మంజుల గురించేనా నువ్వు చెపుతున్నది."

"అవును."

ఆమె మాట్లాడలేదు. అతని చెవులు ఆమె తీర్మానంకొరకు ఎదురు చూస్తున్నాయి.

"ఆ అమ్మాయి విధవ, పైగా మన కులం కూడా కాదు." ఆమె తెప్పరిల్లి అంది.

అతను కళ్ళెత్తి అక్క కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"అన్నీ తెలుసు, పద్మక్కా!"

"నువ్వు.... నువ్వు.... సంప్రదాయాల మైకంలో వున్న యీ సమాజాన్ని, తట్టుకోగలవా?" ఆమె సన్నగా గొణిగింది.

అతను చిరునవ్వు నవ్వాడు.

"సంప్రదాయాలు కాలాన్నిబట్టి, అవసరాలనుబట్టి మన కళ్ళముందే మార్చబడుతున్నాయని, ఈ సంప్రదాయాన్ని హర్షించే రోజులు కూడా ముందున్నాయనీ నీకు తెలియదా పద్మక్కా?"

తమ్ముడి కళ్ళలోకి జాలిగా చూస్తూ అంది.

"మన యీ ప్రత్యేకమైన ఆచరణను నలుగురి నోట్లోనుండి కప్పిపెట్టుకోవడానికి మనకు చేతిలో చాలినంత డబ్బైనా లేదు, కదరా తమ్ముడూ!"

అతనీమారు నిరసనగా నవ్వాడు.

"నేను చేయబోతున్న ఈ పనిని లోకం కళ్ళనుండి కప్పిపుచ్చాలని అనుకోవడం లేదు పద్మక్కా!"

"మంచిది కానీ, నువ్వు ఆదర్శాల పేరిట, ఆ అమ్మాయిమీద జాలితో ఈ నిర్ణయం చేసుకోలేదు కదా? అదే నిజమయితే, ఆ తరువాత ఆ పిల్లను రెండింటికి చెడ్డ రేవడిని చేసినవాడవవుతావు."

"అక్కా!" అక్క కళ్ళలోకి దీనంగా చూశాడు. "నీకు నామీద నమ్మకం లేదా, పద్మక్కా!"

ఆమె నిండుగా నవ్వింది. ప్రేమగా తమ్ముడి తల నిమురుతూ అంది.

"లేక కాదు నాయనా! మన మనసు కోతిలాంటిది. అంతలోనే నవ్వుతుంది.

అంతలోనే ఏడుస్తుంది. అదీకాక ఆడదానికున్న మనోశ్శక్తి మగవాళ్ళకి వుండదయ్యా, అంతేగాని, నిన్నుగాక ఇంకెవరిని నమ్ముతానురా కృష్ణా!" ఆఖరి మాటలంటున్నప్పుడు ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. ఆ నీటి పొరల వెనక ఆమె భర్త కదలాడాడు. భర్త దగ్గర నమ్మకాన్ని పొందలేని దౌర్భాగ్యురాలామె. భర్తను పూర్తిగా విశ్వసించి మోసపోయిన అదృష్టహీనురాలామె. అపనమ్మకాలు, అకర్షణల మధ్యగా మాత్రమే సంసారం చేస్తున్న ఆమెకు తమ్ముడు తప్ప మరెవ్వరూ లేరు.

* * * * *

పద్మ భర్తకి తమలపాకు చిలకలు చుట్టిస్తూ ఆలోచిస్తూంది.

'ఈ విషయాన్ని భర్తకెలా చెప్పడం? అతను యీ పనిని హర్షిస్తాడా? ఆమోదిస్తాడా?.... ఉహుం తనకు బాగా తెలుసు. తమ్ముడిమీద వ్యంగ్యబాణాలు విసిరి, తన హృదయాన్ని చిత్రహింస పెడతాడు. కానీ... కానీ చెప్పితీరాలి. చెప్పాక వినవలసిన నాలుగు మాటలు గుండెలు చిక్కబట్టుకుని వినేస్తే ఆ తరువాత నిశ్చింతగా ఉండొచ్చు. అంతేగాని, ఇప్పుడు తను అతనినుండి ఈ విషయాన్ని దాచిపెడితే, తరువాత వచ్చే పరిస్థితులకు తను తట్టుకోలేదు.

"ఏమండీ!"

"ఏమిటీ?" అన్నట్టు చూసాడతను.

సంశయిస్తూ, సంశయిస్తూ మెల్లిగా చెప్పింది పద్మ.

"మా తమ్ముడు, బాబూరావు మాష్టారి కోడలు మంజులను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు."

ప్రసన్నంగా వున్న అతని నుదుటిమీద బొమ ముడిపడింది. ఆ తరువాత అతను మాట్లాడకుండా అటు తిరిగి పడుకున్నాడు.

భర్త యీ రకం ప్రవర్తన చాలా కొత్తరకంగా అనిపించింది పద్మకు. ఆమెకు తెలుసు... తన భర్తకు ఇలాంటి ఆదర్శాలంటే గిట్టవని. పెద్ద రాద్ధాంతం చేస్తాడనుకుంది. దానికి విరుద్ధంగా తన అయిష్టాన్ని తనలోనే దాచుకుని, మౌనంగా పడుకున్న భర్తను తలుచుకోగానే అతనిమీదున్న కొండంత ప్రేమ పైకి పొంగింది. అతని తలమీద చెయ్యి వేసి నిమురుతూ, నిశ్చింతగా ఎప్పుడు నిద్రపోయిందో నిద్రపోయింది. ఇంకా తెల్లవారక ముందే, భర్త కుదుపులకు కమ్మటి కలల మైకంనుండి తేరుకుని గబుక్కున లేచి కూర్చుంది పద్మ.

"నీకు మొగుడే కావాలో, తమ్ముడే కావాలో ఆలోచించుకో."

ఇంకా నిద్రమత్తు వదలని పద్మకు ఆ మాటలకర్థం బోధపడలేదు.

"ఏమిటి మీరంటున్నది?"

"ఇటువంటి అప్రాచ్యపు పనులు మా యింటా వంటా లేవు. మీ తమ్ముడు ఒక చెడిపోయినదాన్ని రేప్పొద్దున 'తగుదునమ్మా' అని మెడకు కట్టుకుని, పెద్ద ఘనకార్యం చేస్తున్నట్టు మనింటికొస్తే నేను తల ఎత్తుకు తిరగలేను."

పద్మ మైకం పూర్తిగా దిగిపోయింది. ఆమె అందమైన కల కరిగిపోయింది. ఆమెకు దాంపత్య జీవితంలో మొదటిమారు కలిగిన ఆనందం తాలూకు స్మృతి క్షణ మాత్రం మిగలకుండా వెనక్కు తప్పుకుంది.

పద్మ పూర్తిగా మూగబోయిపోయింది.

"మంజుల చెడిపోయిందా? భర్తతో రెండు మాసాలు మాత్రం కాపురం చేసి అతను అస్తమిస్తూ ఆమె నూరేళ్ళ జీవితాన్ని బద్దలుచేసిపోతే, మౌనంగా అత్తమామల చాటున గుట్టుగా బ్రతకడమే ఆమె చేసిన చెడ్డపనా? ఎవరో ఉదారుడు మనస్ఫూర్తిగా 'నిన్ను పెళ్ళి చేసుకుని, కొత్త లోకాలు చూపిస్తాను, రమ్మంటే' అందుకు ఒప్పుకుని తన బాటను తను వెతుక్కోవడమే ఆమెవల్ల జరిగిన దోషమా?" ఆమెకంతా అయోమయంగా ఉంది.

'మా తమ్ముడు రెండో పెళ్ళి మంజులను చేసుకుంటే, వాడి పవిత్రత పాడవుతుందా? దానితో వీళ్ళ పరువు ప్రతిష్టల కుండకు చిల్లి ఏర్పడుతుందా? అదే నిజమయితే, వీళ్ళ చెల్లెలు భర్తచాటున వ్యభిచరిస్తుంటే వీళ్ళకు చీమ కుట్టినట్టయినా ఎందుకు లేదు? తన భార్యకు చెప్పి మరీ పరాయి స్త్రీలతో సరసాలాడడానికి వెళ్ళే ఈయనకు ఆ మాటలనడానికి మనస్సెలా ఒప్పింది?'

ఆమెకు తెలుసు తన తమ్ముడు చేస్తున్న యీ పని సంఘ విదూరమని. కానీ... కానీ ఆమె బాధల్లా తను అసహ్యించుకునే ఇలాంటి సంఘానికి తన భర్త ప్రతినిధి అయినందుకు.

'తను కోరుకున్నదీ, తన కలల్లో ఊహించుకొన్నదీ ఇలాంటి భర్తనా? తన ఊహల్లో ఎంత ఉన్నతంగా ఊహించుకుంది! ఎంత విశాలంగా ఉండాలని కోరుకుంది! కుత్సితమైన మనుషుల్ని అసహ్యించుకునే తనకి బాగా గర్వభంగం జరిగింది. తన భర్త, తన సర్వస్వం, తన ప్రాణం.... అంత ఉదారుడు కాకపోతే మానే, ఉదారులను హర్షించే మనస్తత్వం కూడా కాకపోయిందే!' గిలగిలలాడే మనస్సుతో వెర్రిగా భర్తవైపు చూసిందామె.

"ఏం అలా చూస్తావు? నీ తమ్ముడు మంజులను చేసుకుంటే వాడు కాదు కదా, నువ్వు కూడా నా గడప తొక్కడానికి వీలులేదు."

ఉలిక్కిపడింది పద్మ. మరీ అంత కఠోరంగా అతను శాసిస్తాడనుకోలేదామె. సంఘాన్ని, దురాచారాల్ని అసహ్యించుకునే ఆమెకు సంఘానికి దూరంగా, దానికి వ్యతిరేకంగా బ్రతకాలంటే భయం.

భవిష్యత్తును తలుచుకుని భయంతో ముద్దకట్టుకుపోతున్న భార్యను ఉద్దేశించి మరలా అతనే అన్నాడు.

"ఏమిటింకా ఆలోచన? నా పట్టుదల నీకు తెలియంది కాదు."

"అవును తన భర్త పట్టుదల తనకు తెలియనిదా? పట్టుపట్టి తన ముసలి తల్లినీ, రోగిష్టి తండ్రినీ, వయసులో వున్న చెల్లెలినీ తనకు భారమని పరమదరిద్రుడైన తమ్ముడింటికి తోలేసిన అతని పట్టుదలా, ఔదార్యమూ తనకు తెలియనివా?"

చిరునవ్వుతో వెళ్ళి, బేలముఖంతో తిరిగివస్తున్న అక్క ముఖం చూడగానే కృష్ణ గుండెలు జారిపోయాయి.

'మరలా ఏమి సమస్య తెచ్చిపెట్టాడు బావ? ఈ సహృదయురాలిని ఎందుకంత కక్షకట్టి సాధిస్తున్నాడు? అతని అదృష్టాన్ని అతనెందుకు గుర్తించలేకపోతున్నాడు?'

అతను తన అక్క దౌర్భాగ్యం గురించి చింతపడుతుంటే, అతని రెండు చేతులూ పట్టుకుని అతన కళ్ళలోకి దీనంగా చూస్తూ అంది పద్మ.

"కృష్ణా! నీ చేతిమీదుగా నా పెళ్ళి చేశావు. నా కొరకు ఇంతవరకూ నీ ప్రతి రక్తపు బొట్టునూ ధారపోశావు. నా కాపురంలో నీ చేతులతోనే చిచ్చుపెట్టకురా, తమ్ముడూ!"

"పద్మక్కా? నేనా!?" అతను వెర్రిగా అక్క కళ్ళలోకి చూశాడు.

ఆమె కళ్ళనీళ్ళతో బేలగా అవునన్నట్టు తల వూపింది.

"నేనేం చేస్తే నీవు కళకళలాడుతూ ఉంటావో చెప్పు పద్మక్కా!" ఈ అభియోగానికి అర్థం తెలియని కృష్ణ చాలా నెమ్మదిగా అడిగాడు.

ఆమె అంతర్యం బాధతోనూ, అవమానంతోనూ ఉండచుట్టుకుపోతోంది. తన భర్త తాలూకు నిజస్వరూపాన్ని కనీసం తమ్ముడి దగ్గరకూడా బయటపెట్టడానికి ఆమె మనస్సు అంగీకరించడంలేదు. కానీ తప్పదు. చెప్పి తీరాలి. తన రక్తంలో రక్తమయిన తమ్ముణ్ణి బ్రతిమలాడుకుని, తన కాపురం నెలబెట్టుకోవాలి. తమ సంసారాల్లో ఎన్ని

అయిష్టాలు, ఎన్ని అవకతవకలు వున్నా సరే, భర్త కాళ్ళముందు కాలం వెళ్ళబుచ్చడం కంటే మరో గత్యంతరం లేదనుకునే వేలాదిమంది స్త్రీలకు ప్రతినిధి పద్మ.

"ఏమైంది? ఏమైంది, పద్మక్కా అసలు?"

ఆమె కళ్ళు వాల్చుకుని, ఊపిరి బిగపట్టుకుని చెప్పింది.

"నువ్వీ పెళ్ళిచేసుకోవడం మీ బావకు ఇష్టం లేదురా"

అతను ఒక్క క్షణం వెనక్కు తగ్గాడు.

"ఎందుకని?" అతని కంఠస్వరం కఠినంగా మారిపోయింది.

ఆమె దానికి జవాబు చెప్పలేదు.

"నువ్వు మంజులను చేసుకున్నే పక్షంలో అయన నన్ను వదిలేస్తారట."

అతను ఆ జవాబును వినిపించుకోలేదు.

"ఎందుకని? అని అడుగుతున్నాను నేను."

తమ్ముడి జీరలువారిన ఎర్రటి కళ్ళలోకి భయం భయంగా చూసిందామె.

అక్క కళ్ళలో బేలతనానికి నిలువునా నీరయిపోయాడు కృష్ణ.

"అక్కా! నాకు తెలుసు... నువ్వు చెప్పక్కరలేదు. కానీ... కానీ, నువ్వేమనుకుంటున్నావు పద్మక్కా?"

ఆమె విచారంగా నవ్వింది. "ఏమనుకోమంటావురా? నువ్వే చెప్పు."

"పోనీ ఇది చెప్పు పద్మక్కా! నాకు ఇష్టమైన ఒక భర్తృహీనకు జీవితాన్నివ్వడమేనా నేను చేస్తున్న నేరం? దానికి నువ్వు కూడా నిందిస్తున్నావా?"

ఆమె ఒక్క క్షణం మాట్లాడలేదు. తన బలాన్నంతా కూడదీసుకుని అంది.

"నువ్వు చేసే పని నేరమో, కాదో నాకు తెలియదు నాయనా! కానీ, నేను చెప్పేది.... ఒక పడిపోయిన సంసారాన్ని తిరిగి నిలబెట్టే వుద్దేశంతో, నడుస్తున్న సంసారాన్ని పడదోయడం న్యాయం కాదురా."

దెబ్బతిన్నట్టు చూశాడు కృష్ణ.

"బావ మూర్ఖంగా ప్రవర్తిస్తే నువ్వు కూడా దానికి అవునంటావా?"

ఆమె నిష్ఠూరంగా అంది.

"అయన మూర్ఖుడవనీ, మరెవరన్నా అవనీ.... అతను నాకు కట్టుకున్న మొగుడు. అతని నీడలో వుండటమే నాకు సంతోషం. ఆ తరువాత నీ ఇష్టం."

కృష్ణ అక్క కళ్ళలోకి తదేకంగా, చిత్రంగా చూశాడు తరువాత బలవంతంగా కంఠంలోకి మృదుత్వాన్ని తెచ్చుకుంటూ అన్నాడు.

"అయితే చెప్పు, నన్నిప్పుడేం చేయమంటావో చెప్పు."

తమ్ముడి ప్రవర్తనతో ఆమె భావ గాంభీర్యం సడలిపోయింది.

"కృష్ణా! నీ సుఖాన్ని కాదనేంత స్వార్థం నాలో లేదు. కానీ, కృష్ణా! లోకమంతా నీలా లేదు. భర్తచేత కాదనబడ్డ స్త్రీకి యీ సమాజంలో భద్రతకూడా లేదురా. అందుకే నిన్నింత బ్రతిమాలుకుంటున్నాను. నీ చేతులతో నిలబెట్టిన నీ అక్క కాపురాన్ని నీ చేతులతోనే పడదొయ్యకు నిన్ను చేతులు జోడించి ప్రార్థిస్తున్నానురా."

కృష్ణ మరేమీ మాట్లాడలేదు. అక్కను ఓదార్చలేదు. కలతపడ్డ మనసుతో అక్కడి నుండి వెళ్ళిపోయి, అర్ధరాత్రి తిరిగివచ్చి అక్కకు మాట ఇచ్చాడు.

"అలాగే, మీ ఇష్టమే. మంజులను పెళ్ళి మాత్రం చేసుకోను."

అప్పటికి ఆవేశం సడలిపోయిన పద్మకు తమ్ముడి జవాబు శాంతినివ్వలేదు. అతని నిర్ణయాన్ని ఆమె అంతరాత్మ ఒప్పుకోలేదు. తమ్ముడి తల నిమురుతూ అంది.

"పోనీ, మీ దగ్గర నాకింత చోటిస్తారా కృష్ణా?"

"దేనికి?"

"నాకు కోరికలెలాగూ చచ్చిపోయాయి. కోరికలున్న మిమ్మల్ని క్షోభపెట్టి నేను బావుకునేది మాత్రమేముంది? నువ్వు మంజులను పెళ్ళిచేసుకో."

విరక్తిగా నవ్వాడు కృష్ణ.

"వద్దు పద్మక్కా! ఈ ఇంటికి ఒకే ఒక్క ఆడపడుచువు నువ్వు. నువ్వు కంటతడి పెడితే మాకు శుభం లేదు. మగవాణ్ణి నన్ను అనగలిగే సాహసం సంఘానికి లేదు. ఫరవాలేదు. నువ్వు బావదగ్గరికి వెళ్ళు. నీ పుట్టింట్లో సంఘం ముద్రించిన ఆడదిక్కు లేకపోయినా, నేనున్నానని మాత్రం గుర్తుంచుకో."

* * * * *

కొంతకాలంగా తమ్ముడినీ, వాడు ఏర్పరచుకున్న సంఘవిదూరమైన సంసారాన్ని చూడాలనే గాఢమైన కోర్కెను ఇక దాచుకోలేకపోయింది. తన రక్తంలో రక్తమైన తమ్ముడిని చూడాలనే గాఢమైన ఆమె వాంఛ ఈనాటికి బహిర్గతమైంది.

భర్త దగ్గరకు మెల్లిగా చేరి ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"ఒక్కమారు కృష్ణుడి దగ్గరకు వెళ్ళి వస్తానండీ."

వెకిలిగా నవ్వాడతను.

"ఎవరి దగ్గరకు? ఆ గోపాలకృష్ణుడి దగ్గరకా?"

అతని అపహాస్యం ఆమె హృదయాన్ని నేరుగా వచ్చి తగిలింది. తన కొరకు తన సంసారంకొరకు తన తమ్ముడు చేసిన త్యాగాన్ని తలుచుకున్నప్పుడల్లా ఆమె గుండెలు పశ్చాత్తాపంతో పగిలిపోతాయి. తన అక్క సంసారాన్ని నిలపడానికి మంజులను పెళ్ళి చేసుకోనని మాట ఇచ్చిన అతను తనను నమ్ముకున్న మంజులను కూడా అన్యాయం చేయలేదు. నలుగురెదుట నాలుగు అక్షింతలు పడకుండానే, దేవుని ఎదుట పూలమాలలయినా మార్చుకోకుండానే, రిజిస్ట్రార్ ఆఫీసులో సంతకాలయినా చేయకుండానే వాళ్ళ అంతరాత్మల సాక్షిగా వాళ్ళిద్దరూ దంపతులయ్యారు. వాడు చేసిన ఈ త్యాగంవల్ల వాడు, వాడిద్వారా మంజుల ఎందరి అపహాస్యాలకు గురి కావలసివచ్చిందో ఆమెకు బాగా తెలుసు. 'ఇదిగో తల అంటే, అదుగో తోక' అనే ఈ గుడ్డిలోకం వాళ్ళ అందమైన సంసారానికి ఎంత అపవిత్రతను అంటగట్టిందో, ఎన్ని అపవాదులను రుద్దిందో పద్మ చెవులను దాటిపోలేదు. అందమైన మంజుల ద్వారా అవినీతిపరంగా డబ్బు గడిస్తున్నాడనే నికృష్టమైన అపవాదును విని, తన తమ్ముడి లేత హృదయం ఎలా తట్టుకుందో ఊహించుకుంటేనే ఆమె వణికిపోతుంది. పెళ్ళి చేసుకుని, బంగారంలాంటి భార్య వుండగానే పరస్త్రీల వ్యామోహానికి దాసులయ్యే ఈ మగవాళ్ళంతా, మంజుల తప్ప మరో స్త్రీని కన్నెత్తి చూడని తన తమ్ముడిని గోపాలకృష్ణుడని అవహేళన చేస్తూ వుంటే ఆమె తమ్ముని దౌర్భాగ్యానికి మూగగా రోదించేది. ఎవరేమనుకున్నా బహుశా ఆమె లెక్కచేసి వుండేదికాదుగానీ, తన భర్త, తన కష్టాలలో సానుభూతి చూపించవలసిన తోడే, తన కన్నీటికి కారణమవుతుంటే, ఆమెకు తాత్కాలికంగా జీవితంమీద విరక్తి కలుగుతుండేది. అయినా, ఎన్నడూ ఆమె భర్త మాటకు పల్లెత్తు జవాబు చెప్పలేదు. కానీ, ఈ రోజెందుకో ఆమెకే అర్థంకాని తెగింపు ఆమెలో బయలుదేరింది.

"గోపాలకృష్ణుడి ఆంతర్యం, రాధమ్మ ఆరాధన మీకు చెప్పినా అర్థం కావులెండి."

"ఎవరా రాధమ్మ?"

పద్మ మాట్లాడలేదు. మాటకు మాటకలపడం ఆమెకు ఇష్టం లేదు.

"సమర్థించక సమర్థించక మీ తమ్ముడినే సమర్థించాలా?"

పద్మ యీ మారు మౌనంగా ఉండలేకపోయింది.

"వాడిని కాక ఇంకెవరిని సమర్థించను? వాడు నా తమ్ముడు కావడమే నాకున్న ఒకే ఒక్క అదృష్టం."

తన అతుకుబొతుకుల సంసారాన్ని ఎలాగైనా నిలుపుకోవాలనే తాపత్రయం, తన భర్త జంతుప్రవృత్తితో ఆమెలో మెల్ల మెల్లగా సడలిపోతోంది.

"ఆహా! మీ తమ్ముడు చేసింది పెద్ద ఘనకార్యం కదూ! అందుకేనా తమరింత విర్రవీగడం?"

ఛర్రున లేచింది పద్మ. ఈ బంధం తెగిపోతుందేమో అని భయపడలేదు.

"అవును నమ్మించినవాళ్ళను మోసం చెయ్యడం వాడికి తెలియదు. తోడబుట్టిన దాని సంసారాన్ని కూలదోయడం వాడికసలు చేతకాదు. అందుకే కదూ వాడంటే మీకంత పగ. 'నిన్ను ఏలుకోను పొమ్మనడం' మీకే తగింది. ఆ మాట వాడు అనలేక, తనను నమ్ముకున్న మంజులతో మనస్ఫూర్తిగా కాపురం చేస్తున్నాడు. అందువల్ల మీకొచ్చిన నష్టమేమిటి? సంఘానికొచ్చిన అగౌరవమేమిటి?"

పద్మ భర్త కొద్దిగా తగ్గాడు.

"మన భారతదేశంలో భార్యాభర్తల సంబంధం ఎంత పవిత్రమైనది! మెళ్ళో తాళి కట్ట కట్టకుండానే భార్యా భర్తలయిపోదామనుకున్నాడేం మీ తమ్ముడు?"

"దానికి కారకులెవరు?" తగ్గు స్వరంతో అంది పద్మ.

"కారకులెవరైనా కానీ, ఆడది 'తగుదునమ్మా' అంటూ రెండో పెళ్ళి చేసుకుంటుంటే, అదీ నా భార్య తమ్ముడు పాడైపోతూంటే చూడలేకపోయాను ఆ రోజు... అయితే, ఏమంటావిప్పుడు?"

"ఈనాడు, అంతా అయిపోయిన ఈ రోజు ఏమని మాత్రం ఏం ప్రయోజనం? అయినా, భార్య మనస్సును ఇంత బాగా అర్థం చేసుకునే మీరు, భార్య తమ్ముడి క్షేమాన్ని ఇంత అందంగా కాంక్షించే మీరు నాకు భర్తగా వుండగా నేనింకేమి మాట్లాడేది!"

"పద్మా!"

"ఎందుకరుస్తారు? మీరూ, సంఘమూకూడా ఇప్పుడు చల్లగానే వున్నారుగా. కాకపోతే బజారు స్త్రీల జాబితాలోకి మంజుల ఎక్కకపోవడమే మీలాంటి మగవాళ్ళున్న ఈ సంఘానికి జరిగిన అన్యాయం."

"నోరు మూసుకో.... మాటలు నేరుస్తున్నావే."

"ఈ రోజు కొత్తగా నోరు మూసుకునేదేముంది? మీచేత మూడుముళ్ళు వేయించుకున్ననాడే నా నోరు మూతపడింది. నాకూ తెలుసు.... ఇంకా ఎక్కువ మాట్లాడితే యీ రోజుతో మన బంధం తెగిపోతుందని, పరవాలేదు. మన అదృష్టం... మనకు పిల్లల్నివ్వలేదు భగవంతుడు. నాకు బ్రతకాలని వీసమెత్తు వాంఛ కూడా లేదు.

మీకు.... మరో పదేళ్ళ తర్వాతయినా సరే తమ కూతుళ్ళను, సంతోషంగా కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యడానికి చాలా మంది తండ్రులు చేతులు కట్టుకుని క్యూలో నిలబడి వుంటారు. కానివ్వండి, జరిగేదేదో జరగనివ్వండి."

ఈ రోజు చాలా కొత్తగా, దయ్యం పట్టినట్టు మాట్లాడుతున్న భార్యను అవాక్కయి చూస్తుండిపోయాడతను.

* * * * *

హడావిడిగా, అలసిపోయి, వాడిపోయిన ముఖంతో వస్తున్న పద్మ కెదురుగా వస్తూ ఆదరంగా అంది మంజుల.

"రండి వదినా!"

'వదినా!' ఇన్నాళ్ళకు, ఇన్నాళ్ళకు ఎంత మధురమైన పిలుపు! తనకు ముగ్గురు మరదులు, ఒక ఆడబిడ్డ వున్నా, వాళ్ళ దగ్గరనుండి ఈ మాత్రపు ఆప్యాయతను, వీసమెత్తు గౌరవాన్ని పొందలేకపోయింది.

"రండి కూర్చోండి వదినా!"

కొన్ని సంవత్సరాల తరువాత మరల ఆ గడపతొక్కిన పద్మ నీరస స్వరంతో అడిగింది! "వాడేడమ్మా?"

"వస్తారు. మీరు అలసిపోయినట్టున్నారు. వచ్చి స్నానం చెయ్యండి."

"తరువాత చేస్తానులే, మంజులా." అంటూ నిర్వీర్యంగా అక్కడున్న మంచంమీద కూలబడిపోయింది పద్మ. ఆమెకు ఎంత త్వరగా తమ్ముడు వస్తే అంత త్వరగా తను చెప్పదలచుకున్నది చెప్పేసి గుండె బరువు దించుకోవాలని వుంది. ఆమె అంతర్యాన్ని పసిగట్టినట్లే అప్పుడే వచ్చిన కృష్ణకు, తన భార్య, అక్క పక్క పక్కన కూర్చుని వుండడం కనుల పండువుగా కనిపించింది. తను, మంజుల కలిసి జీవించడం మొదలుపెట్టిన తరువాత, మొట్టమొదట వచ్చిన, కోరిన అతిథి ఆమె.

"అక్కా! ఎన్నాళ్ళకు గుర్తుకొచ్చాను! బావ పంపించాడా?"

ఆమె దానికి జవాబు చెప్పలేదు. చటుక్కున అతని చెయ్యి పట్టుకుని తన పక్కగా కూర్చోబెట్టుకుని అతని తల నిమురుతూ, గద్గద కంఠాన చెప్పింది!

"నా వల్ల నీవెంత పోగొట్టుకున్నావురా? నీ పచ్చటి బ్రతుకులో ఎంతటి కల్మషాన్ని కలుపుతున్నారురా వీళ్ళు! నా వల్ల.... నా వల్ల.... నువ్వు అపనిందల పాలవడానికి వీలులేదు. నువ్వు అందరిలా సుఖంగా, శాంతంగా సంసారం చేసుకోవాలిరా."

అతను నిండుగా నవ్వాడు.

"నువ్వు బాధపడకక్కా. పెళ్ళయిన చాలా సంసారాలకంటే చాలా పచ్చగానే బ్రతుకుతున్నాము మేము. ఆవేశాలలో ఏముంది.... తెలివిగా సమస్యలని పరిష్కరించు కోవాలి గాని. అయినా జీవితానికి ఒక రూలనేదేముంది? నాకు నచ్చిన రూలు ఇది. ఎవరు మెచ్చినా, మెచ్చకపోయినా రెండు సంసారాలూ పచ్చగానే వున్నాయి. చాలదా అక్కా?"

"అహఁ అహఁ... అలా కాదు, అలా కాదు, నువ్వు మంజులను పెళ్ళి చేసుకో.... లేకపోతే నాకు మనశ్శాంతి లేదురా, కృష్ణా!"

కృష్ణ ఫక్కున నవ్వాడు.

"ఇంకా నీ తమ్ముడు పసివాడనుకుంటున్నావా, అక్కా నా తలవైపొకమారు చూడు" అతని తలలో సగానికి పైగా పండిపోయిన వెంట్రుకలు అమె కళ్ళలో నీళ్ళు నింపాయి.

"తన పిచ్చిగాని ఆ కాలం మరలా వస్తుందా? తన తమ్ముడు తనను ఆశీర్వ దించమని అడిగి దగ్గర దగ్గర పదిహేను సంవత్సరాలు! వయసుకంటే ఎదిగిపోయి సంధ్య తిరిగిపోనున్న అతని జీవితానికి క్రొత్తగా తనేం పెళ్ళి చేస్తుంది?"

చాలా హాయిగా, నిండుగా, వ్యధల కతీతంగా నవ్వుతున్న తమ్ముణ్ణి చిత్రంగా చూస్తూ ఉండిపోయింది పద్మ.